క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న దాత

డోన్: పట్టణంలో షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి కొండపేటకు చెందిన రిటైర్డు ఆర్మీ ఉద్యోగి వెంకట్రాముడు సోమవారం రూ. 50,116ను విరాళంగా అందజేశారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యుడు ధర్మవరం సుబ్బారెడ్డికి చెక్కు అందజేశారు. కొండా సురేష్, కందుకూరి పార్థ, సీఎం శ్రీనివాసులు, శ్రీరాములు, ఆర్ఈ రాఘవేంద్ర, మల్లికార్జునరెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డీఏ ప్రకటించి పీఆర్సీని నియమించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి రూ. 12 లక్షల ఆదాయం ఉన్న వారికి పన్ను నుంచి మినహాయింపు ఇవ్వడం శుభ పరిణామమన్నారు. దీని వల్ల చాలా మంది మధ్య తరగతి ఉద్యోగులు, పెన్షనర్లకు మినహాయింపు లభించి వారి ఆర్థిక కొనుగోలు శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సంక్షేమం కోసం ప్రకటించిన హామీలు నెరవేర్చి మాట నిలుపుకోవాలని కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొలిమిగుండ్ల: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి సోమవారం తెలిపారు. మండలానికి మొత్తం 55 యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. బీసీ(ఏ)–23, బీసీ(బీ)–14, బీసీ(డీ)–7, బీసీ(ఈ)–11 యూనిట్లు కేటాంచారని చెప్పారు. అంకిరెడ్డిపల్లె ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌కు 11 యూనిట్లు, కొలిమిగుండ్ల ఏపీజీబీకి 13, పెట్నికోట బ్యాంక్‌కు 10, కొలిమిగుండ్ల స్టేట్ బ్యాంక్‌కు 12, పేరుసోముల యూనియన్ బ్యాంక్‌కు 9 యూనిట్లు కేటాయించారన్నారు. 50 శాతం సబ్సిడీ సౌకర్యం కలదన్నారు. యూనిట్ విలువ రూ.2లక్షలు, రూ.3 లక్షలు, రూ.5 లక్షలు ఉన్నాయన్నారు. ఫిబ్రవరి 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



గ్రామంలోని చెత్తను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

డోన్ రూరల్: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకర జీవనం సాధ్యమని కన్నపకుంట గ్రామ సర్పంచ్ కళ్యాణి అన్నారు. గ్రామంలో సోమవారం ప్లాస్టిక్ కవర్‌లు, చెత్త చెదారాన్ని కార్మికులతో శుభ్రం చేయించారు. గ్రామస్తులు ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేయకూడదని తెలిపారు. స్వచ్ఛ గ్రామానికి అందరూ సహకరించాలని కోరారు. చెత్తపేరుకుపోతే దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు.

సమాజ సేవతోనే సార్థకత



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: సమాజ సేవతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని వైద్యులు సాగరిక, వాణి స్వప్న ప్రియ అన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులు, గర్భిణీలు, వృద్ధులకు దాత మర్రి మహేంద్ర సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధు సూదన్‌రెడ్డి , రాజు అన్నదానం చేశారు. క్లబ్ సభ్యులు సుదర్శన్, రవి, వలిబాషా, కేశాలు నాయుడు పాల్గొన్నారు.

ముచ్చట్ల మల్లికార్జునస్వామికి పూజలు



స్వామివారిని పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్. కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. శివమాలధారులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కందులు.. కన్నీళ్లు

- తేమశాతం ఎక్కువంటూ కొనుగోలు చేయని అధికారులు
- ఇదే అదునుగా రంగంలోకి దిగిన వ్యాపారులు
- తక్కువ ధరతో కొనుగోలు చేస్తున్న వైనం
- కంది రైతుల ఆవేదన



బనగానపల్లె: కందుల కొనుగోలులో మార్క్‌ఫెడ్ అధికారులు అమలు చేస్తున్న తేమశాతం నిబంధన రైతుల పాలిట శాపంగా మారింది. నంద్యాల జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోలు ఇప్పటికే ప్రారంభమైంది. అయితే బనగానపల్లె నియోజవర్గంలో కంది పంటకు తేమ శాతం ఎక్కువగా ఉందంటూ కొనుగోలును ప్రారంభించలేదు. దీంతో కంది రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో డోన్ డివిజన్ తరువాత బనగానపల్లె నియోజకవర్గంలో అత్యధికంగా 5 వేల హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. ఒక్క బనగానపల్లె మండలంలోనే సుమారు 2 వేల హెక్టార్లలో పంట సాగైంది.

నిబంధనలతో నష్టపోతున్న రైతన్న

నిబంధల ప్రకారం కందుల్లో 12 శాతం మాత్రమే తేమ ఉండాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతుల వద్ద ఉన్న కందుల్లో 20 శాతం తేమ శాతం ఉన్నందున కొనుగోలు చేయలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. వ్యాపారులు మాత్రం తేమ శాతం గురించి ప్రశ్నించకుండా కొనుగోలు చేస్తున్నారని.. మార్క్‌ఫెడ్ అధికారులు మాత్రం తేమశాతం ఎక్కువగా ఉందంటూ పేర్కొనడం విడ్డూరంగా ఉందని పలువురు రైతులు పెదవి విరుస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా లేకున్నా కొనుగోలులో తిరకాసు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు రంగంలోకి దిగి తక్కువ ధరకు అడుగుతున్నారని పలువురు రైతులు పేర్కొన్నారు. రెండు నెలల క్రితం వరకు క్వింటా కంది రూ.7–8 వేలు ఉండగా పంట చేతికొచ్చే సమయానికి వ్యాపారులు రూ.6,500 నుంచి రూ.6,800 వరకు కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ ధర తమకు గిట్టుబాటు కాదని వాపోతున్నారు.

ప్రభుత్వ ధర క్వింటా రూ.7,550

ప్రభుత్వం క్వింటా కందులకు రూ.7,550 గిట్టుబాటు ధరగా నిర్ణయించింది. మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేయాలంటే రైతులు కంది పంటను ఈ–క్రాప్ చేసుకుని ఉండాలి. రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. 12 శాతానికి లోపు తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు.

గత ఏడాది మంచి ధరలు

గత ఏడాది కంది పంటను ప్రైవేట్ వ్యాపారులే క్వింటా రూ.9–10 వేలకు కొనుగోలు చేయడంతో ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. ఈ ఏడాది మంచి ధరలు ఉంటాయని చాలా మంది రైతులు ఈ పంటను సాగు చేశారు. అయితే ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కనీసం ప్రభుత్వం ఆదుకుంటుందని భావిస్తే తేమ శాతం మెలిక పెట్టి తమకు ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అధికారులు మాత్రం కంది దిగుబడులను 4–5 రోజులు ఆరబోస్తే తేమ శాతం తగ్గుతుందని.. ఆ తర్వాత కొనుగోలు చేస్తామని సలహాలు ఇస్తున్నారు.

రైతులకు న్యాయం చేయాలి



నేను 20 ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్క్‌ఫెడ్ అధికారులు 12 తేమ శాతం ఉండాలని చెప్పి కొనుగోలు చేయడం లేదు. ఈ విషయాన్ని పునరాలోచించాలి. పంట కోతకు ముందు సుమారు పది రోజులు పొలంలోనే పంటను ఎండబెట్టాం. తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోకుండా రైతుల నుంచి పంటను కొనుగోలు చేసి ఆదుకోవాలి. ఇళ్ల వద్ద మళ్లీ పంట ఆరబెట్టాలంటే చాలా కష్టంగా ఉంటుంది. –టి.చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, ఎర్రగుడి

ఏం చేయాలో అర్థం కావడం లేదు



గత ఏడాది రూ.8 వేల నుంచి రూ.9 వేల ధర ఉండడంతో ఈ ఏడాది 16 ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం రూ. 7,550 మద్దతు ధర ప్రకటించింది. అయితే మార్క్ ఫెడ్ అధికారులు తేమ శాతం నిబంధనతో కొనుగోలు చేయడం లేదు. వ్యాపారులు రూ.6 వేల నుంచి రూ.7 వేలకు అడుగుతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. మళ్లీ ఒకసారి కందుల నాణ్యతను పరిశీలించాలి.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎర్రగుడి

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి

డోన్ రూరల్: విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలని డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి అన్నారు. పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్టీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు రోడ్డు భద్రతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్జి తంగమణి హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలని, తప్పు చేయకుంటే ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయీభవ



జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులతో డీఎస్పీ

డోన్ టౌన్: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆకాంక్షించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో 70వ సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే క్రీడాకారులు డోన్‌లో కొద్ది రోజులుగా తీసుకుంటున్న శిక్షణ సోమవారం పూర్తయింది. ఈ సందర్భంగా డీఎస్పీ వారికి ఆల్ ద బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి, కోచ్ చంద్రమౌళి గౌడ్, టీమ్ మేనేజర్ ప్రకాష్, కెప్టెన్ రమేష్, వైస్ కెప్టెన్ సాయి సురేష్, క్రీడాకారులు ఏడుకొండలు, నాగూర్‌మియా, వీర్రాజు, కిరణ్‌కుమార్, కృష్ణ, బాబుద్దీన్, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలి



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: పొదుపుగ్రూపు మహిళలు స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించి ఆ దిశగా ఆర్థిక బలోపేతం కావాలని వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి శివప్రసాద్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన మహిళలకు జనపనారతో బ్యాగుల తయారీ, మిల్లెట్ యూనిట్ల నిర్వహణ, టెక్స్‌టైల్స్, తదితర రంగాలకు సంబంధించి మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. చివరి రోజు సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆయా రంగాల్లో శిక్షణ తీసుకున్న మహిళలు యూనిట్లను ప్రారంభిస్తే వివిధ బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వాలంభన దిశగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ రవీందర్, ఏపీజీబీ, యూనియన్ బ్యాంకు మేనేజర్లు రాఘవేంద్ర, నరేంద్రకుమార్, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, ట్రైనర్ శ్రీనివాసులు, వెలుగు అధికారులు బాబురావు, శేఖర్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.





ముదిగేడులో ప్రధాన రహదారి పక్కనే చెత్తకుప్పలకు నిప్పు, ముక్కమల్ల గ్రామంలో రోడ్డుపక్కనే చెత్తకుప్పలు

రోడ్డులే డంపింగ్ యార్డులు!

సంజామల: దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు అంటారు. అలాంటి పల్లెల్లో స్వచ్ఛత లోపించింది. ప్రభుత్వాలు లక్షలు ఖర్చుపెట్టి కార్యక్రమాలు చేస్తుంటే కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో లక్ష్యాలు నీరుగారుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో రోడ్డులే డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తూ అపరిశుభ్రత చేస్తున్నారు. ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్నారు. సంజామల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి. సంజామలలో బీసీ హాస్టల్ ఎదుట, ముదిగేడు గ్రామం, ముక్కమల్ల జెడ్పీ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద రోడ్డు పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వాటికి నిప్పు పెట్టడంతో దుర్గంధంతో పాటు పొగతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

గోడౌన్ ఇన్‌చార్జ్‌పై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న డోన్ సివిల్ సప్లై గోడౌన్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేసి విచారణ చేపట్టాలని సర్వజన విద్యార్థి యువజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్, స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ కోరారు. సోమవారం ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ నాగ మణిని కలిసి వినతి పత్రం అందజేశారు. గోడౌన్ నుంచి వివిధ రేషన్ షాపులకు, పాఠశాలలకు పంపిణీ చేసే బియ్యం బస్తాల తూకంలో మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సభను జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్యాపిలి: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీ హైదరాబాద్‌లో తలపెట్టిన 'లక్ష డప్పులు–వేల గొంతుకలు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సుందరం, అవుల నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్సీ కాంప్లెక్స్‌లో పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు రెడ్డిపోగు విజయకుమార్, పాల్రాజు, రాజేష్, కళ్యాణ్, కంబగిరి స్వామి, దుర్గారావు వెంకటేశ్వరరావు, ఓబులపతి పాల్గొన్నారు.

బనగానపల్లెలో ర్యాలీ

బనగానపల్లె: హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమాన్ని మాదిగలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కడియాల జయరాముడు కోరారు. సోమవారం పట్టణంలో డప్పులు వాయిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు బాలస్వామి, గౌరవాధ్యక్షుడు కె.ప్రభాకర్, ఆరోగ్యం , ఖాసీం, తిరుపాల్, పెద్దవెంకటస్వామి, ఎర్రన్న పాల్గొన్నారు.

సరస్వతీ నమోస్తుతే



పాతపేట హైస్కూల్‌లో సరస్వతీ పూజ చేస్తున్న ఉపాధ్యాయులు



బాలుడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం



బేతంచెర్ల: సరస్వతీమాతకు పూజలు చేస్తున్న విద్యార్థులు

- భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు
- పిల్లలకు అక్షరాభ్యాసం

డోన్ టౌన్: నియోజకవర్గంలో వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. డోన్‌లోని ఆలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సరస్వతీ పూజలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సరస్వతీ దేవి చిత్రపటానికి పూజలు చేశారు. తెలుగు ఉపాధ్యాయులు సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి శ్లోకం పఠించారు. విద్యతోనే వివేకం అబ్బుతుందని ,ప్రతి ఒక్కరూ చదువుపై శ్రద్ధపెట్టాలని సూచించారు. అలాగే అక్షర స్కూల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. డోన్ అమ్మవారిశాలలో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం దివంగత నేత ఈర్లదిన్నె వెంకటేశ్వర్లు సతీమణి వసుమతి ఆర్థిక సహకారంతో ఆర్యవైశ్య పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అవోపా, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: స్థానిక సరస్వతీ శిశుమందిరం పాఠశాల కమిటీ సభ్యుడు మదన్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు బాల వెంకటరమణ విద్యార్థుల తల్లిదండ్రులతో హోమం, సరస్వతీ పూజలు చేయించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అలాగే భాగ్యోదయ ఉన్నత పాఠశాలలో చైర్మన్ నాగలక్ష్మిదేవి ఆధ్వర్యంలో సరస్వతీ విగ్రహానికి పూజలు చేశారు. న్యాయవాది నందిపల్లె నారాయణ పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

ప్యాపిలి: మండల పరిధిలోని చిగురుమాన్ సర్కిల్ వద్దనున్న శ్రీలక్ష్మీ విద్యానికేతన్‌లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరస్పాండెంట్ మహేశ్వర్ ఆధ్వర్యంలో 26 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాయత్రి, శభాన, సుజాత, దివ్య, శ్రీవిద్య, శిరీషా, ఉమా, మానస పాల్గొన్నారు.



డోన్: ఆర్యవైశ్య విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న సంఘం నాయకులు



బేతంచెర్ల: చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



ప్యాపిలి: చిన్నారికి అక్షరాభ్యాసం

ముగ్గురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండలంలోని యర్రగుడికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. పాతకక్షలు మనసులో పెట్టుకుని బాలయ్యపై అదే గ్రామానికి చెందిన దస్తగిరి బాబు, కుళ్లాయిస్వామి, మహేంద్ర ఇంట్లోకి చొరబడి కట్టెలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరు: పట్టణ శివారు ఆత్మకూరు–నంద్యాల రహదారిలోని ఉర్దూ స్కూల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హరీష్(40) అనే వ్యక్తి మృతిచెందినట్లు సీఐ రాము సోమవారం తెలిపారు. మృతుడిది పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. వెలుగోడు మండలం మాధవరంలో ఉన్న భార్య పుట్టింటిలో ఉండగా ఆమె వద్దకు ప్రాతకోట నుంచి పల్సర్ బైకుపై వెళ్తూ అదుపు తప్పి కింద పడిపోయాడు. మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాసులు

బనగానపల్లె రూరల్: డ్వాక్రా మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులు అన్నారు. సోమవారం యాగంటిపల్లె గ్రామంలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. పొదుపు సభ్యులకు స్త్రీనిధి రుణాలతో పాటు జీవనోపాధి కల్పనకు ప్రత్యేక రుణాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు శైలజ, కుమారి, షాహనాజ్, సాదక్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేయండి



కాటసాని రామిరెడ్డికి చిత్రపటం బహూకరిస్తున్న నాయకులు

బనగానపల్లె రూరల్: ఇటీవల వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన షేక్ హుస్సేన్ (అనిల్), విద్యార్థి విభాగం అధ్యక్షుడు పూజారి శ్రీనివాసులు సోమవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీని పటిష్టం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్‌ఖైర్, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, గొరెంట్ల వెంకటరమణ, తోట బుచ్చిరెడ్డి, అలీహుసేన్, యూనస్, మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

అవుకు: అకాల మరణం చెందిన స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన కావలి లక్ష్మన్న (35) ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు తమతో కలిసి చదువుకున్న మిత్రుడికి అండగా ఉండాలని ఎస్ఎస్‌సీ 2004–2005 సేవా సంస్థ ద్వారా మృతుని కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. రామాంజనేయులు, వరప్రసాద్, చాంద్, మహేష్, పాంషావలి, వెంకటేష్, భాస్కర్, మల్లికార్జున, గిరిధర్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

డోన్ టౌన్: మండలంలోని ధర్మారం ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఎస్సీల కోసం కమ్యూనిటీ హాల్ (కల్యాణ మండపం), తాగునీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ నాగమణిని కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 848–ఎఫ్ సర్వే నంబర్‌లో ఎస్సీ కాలనీ ఏర్పాటు చేశారని.. అందులో మిగిలిన 50 సెంట్ల ఖాళీ స్థలంలో హాల్ నిర్మించాలని కోరారు. గ్రామస్తులు ఈశ్వరయ్య, శేఖర్, రాముడు, రంగన్న, మాధవస్వామి, నాగార్జున, సాలన్న ఉన్నారు.